www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 27 ఫిబ్రవరి 2024

## జాతీయ లోక్‌అదాలత్ 16వ తేదీకి మార్పు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

వచ్చే నెల 9న జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్ 16వ తేదీకి మార్చినట్లు శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నుండి సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు అందాయని పేర్కొన్నారు. దీనిప్రకారం మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ మార్చి 16న జరుగుతుందని, ఈ విషయాన్ని న్యాయవాదులు, కక్షిదారులు గమనంలో పెట్టుకోవాలని కోరారు. ప్రతిరోజూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ సమక్షంలో ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగులకు హాజరై తమ కేసులను పరిష్కరించుకోవడానికి కృషి చేయాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన కుటుంబ వివాద కేసులో భార్యాభర్తలు ఇరువురు కలిసి కాపురం చేసుకునేలా కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు.

# వాట్సాప్ పరీక్షలు..!

**విద్యాశాఖలో గాడితప్పిన పరీక్షల నిర్వహణ**

**ఫార్మెటివ్ పరీక్షల నిర్వహణ తీరు దారుణం**

**ఉపాధ్యాయులకు వాట్సాప్‌లో ప్రశ్నాపత్రాలు**

**ప్రశ్నలు బోర్డుపై రాస్తే విద్యార్థులు పరీక్ష రాసే పద్ధతిపై విమర్శల వెల్లువ**

**ప్రింటెడ్ ప్రశ్నాపత్రం లేక మూడు లక్షల మంది విద్యార్థుల అవస్థలు**

**45 నిమిషాల సమయం సరిపోక ఆపసోపాలు**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

నూతన విద్యావిధానం ముసుగులో ఇప్పటికే విద్యావ్యవస్థ గాడితప్పింది. ప్రభుత్వం ఫార్మెటివ్ పరీక్షలు నిర్వహిస్తున్న తీరు మరింత దారుణంగా తయారైంది. విద్యార్థులకు పరీక్ష పేపర్ ఇచ్చే పరిస్థితి కూడా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశ్నాపత్రాలను ఉపాధ్యాయుల వాట్సాప్‌కు పంపించి పరీక్షలు నిర్వహించే దుస్థితికి విద్యాశాఖ చేరింది. ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు ఏడాదిలో నాలుగుసార్లు ఫార్మెటివ్ పరీక్షలు నిర్వహిస్తారు. గతంలో వీటిని యూనిట్ టెస్ట్ పరీక్షలుగా పిలిచేవారు. ఈ పరీక్షలు 20 మార్కులకు నిర్వహిస్తారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రస్తుతం నాలుగో ఫార్మెటివ్ పరీక్ష జరుగుతోంది. ఈ నెల 23న పరీక్షలు ప్రారంభమవ్వగా 27న జరిగే ఇంగ్లీష్, టోఫెల్ పరీక్షలతో ముగియనున్నాయి. ఈ పరీక్షలు రాసేందుకు గడిచిన కొద్దిరోజులుగా విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. పరీక్షల నిర్వహణ అంటే ప్రశ్నాపత్రం విద్యార్థులకు ఇవ్వడం, వారు అందులోని ప్రశ్నలకు జవాబులు రాయడం అనేది ఉంటుంది. ఈ పరిస్థితికి విద్యాశాఖ పూర్తిగా తిలోదకాలిచ్చేసింది. రెండు, నాలుగు ఫార్మెటివ్ పరీక్షలకు ప్రశ్నాపత్రం లేకుండా చేసింది. రెండు, నాలుగు ఫార్మెటివ్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలను ఉపాధ్యాయులకు వాట్సాప్‌లో పంపుతున్నారు. ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలను బోర్డుపై రాస్తే వాటిని విద్యార్థులు రాసుకుని పరీక్ష రాయాల్సిన పరిస్థితికి తీసుకొచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు దాదాపు మూడు లక్షల మంది వరకూ ఉన్నారు. వీరంతా ఫార్మెటివ్-4 పరీక్షలు రాసేందుకు నానాతిప్పలు పడుతున్నారు. ఫార్మెటివ్ పరీక్ష 20 మార్కులకు 45 నిమిషాలు సమయం మాత్రమే ఉంటుంది. ఎనిమిది మార్కులకు బిట్లు, 12 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఉపాధ్యాయులు బోర్డుపై రాస్తే వీటిని పేపర్‌పై ఎక్కించుకుని తర్వాత పరీక్ష రాయాలి. దీంతో 45 నిమిషాల సమయం సరిపోని పరిస్థితి కన్పిస్తోంది. అంతేకాకుండా ప్రశ్నలు రాసుకునేటప్పుడు విద్యార్థులంతా పక్కపక్కనే ఉండటంతో కాపీయింగ్ జరిగే పరిస్థితి ఉంటోంది. దీంతో విద్యార్థుల ప్రతిభాపాఠవాలకు కొలమానంగా నిలవాల్సిన పరీక్షలు తూతూమంత్రంగా అన్నట్లు తయారయ్యాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉన్న చోట్ల అన్ని తరగతులకూ సంబంధించిన ప్రశ్నాపత్రాలను బోర్డుపై రాసి పరీక్షలు రాయించడం ఉపాధ్యాయులకు కత్తిమీద సాములా మారింది. పోటీ ప్రపంచంలో విద్యావ్యవస్థను మరింత మెరుగుపర్చాల్సిన పరిస్థితులు ఉన్నప్పటికీ అసలుకే ఎసరు పెడుతున్న దుస్థితి ఏర్పడింది. నూతన విద్యావిధానం పేరుతో మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయడంతో ప్రభుత్వ విద్య పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్న తీరు అందరినీ తీవ్రంగా కలిచివేస్తోంది. పరీక్ష పేపర్లు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద కుటుంబాలకు చెందినవారే. నాణ్యమైన విద్య అందిస్తూ విద్యార్థుల ప్రతిభను బయటకు తీసేవిధంగా పరీక్షలు నిర్వహించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఈ విధంగా విద్యావిధానం కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు చదువుల్లో ఎలా రాణిస్తారో పాలకులు చెప్పాల్సి ఉంది. ఇక నుంచైనా ఫార్మెటివ్ పరీక్షలకు ప్రశ్నాపత్రాలు అందించి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

## 'స్పందన'లో 218 అర్జీలు స్వీకరణ

**సంతృప్తికర రీతిలో అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్ ప్రసన్న వెంకటేష్**

**ప్రజాశక్తి - ఏలూరు**

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కారం చూపడంతోపాటు సకాలంలో అర్జీలను పరిష్కరించడమే ధ్యేయంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్ఒ పుష్పమణి, హౌసింగ్ పీడీ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, సమగ్ర శిక్షాభియాన్ పిఒ బి.సోమశేఖర్, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో 218 అర్జీలు అందాయన్నారు. అర్జీలను ఎలాంటి పెండింగ్ లేకుండా గడువులోపు పరిష్కరించాలని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని అన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత పరిష్కార విధానంపై ప్రజలు సంతృప్తి చెందని కారణంగా దరఖాస్తులు రీఓపెన్ అవుతున్నాయన్నారు. స్పందన దరఖాస్తులు రీఓపెన్ కాని రీతిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులకు నాణ్యమైన పరిష్కార ఎండార్స్‌మెంట్ అందజేయాలన్నారు.

# క్విట్ డబ్ల్యుటిఒ అంటూ నిరసనల వెల్లువ

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

రైతులకు, కార్మికులకు, ప్రజలకు నష్టం కలిగించే, వ్యవసాయ రంగాన్ని, పరిశ్రమలను దెబ్బతీసే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)తో ఒప్పందాల నుండి భారత్ వైదొలగాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు క్విట్ డబ్ల్యుటిఒ డే సందర్భంగా ఏలూరులో రైతుసంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం వసంతమహల్ సెంటర్, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. డబ్ల్యుటిఒ ఒప్పంద ప్రతులను దహనం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్విట్ డబ్ల్యుటిఒ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబా, ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడారు. అబుదాబిలో జరుగుతున్న డబ్ల్యుటిఒ సమావేశాల్లో రైతులకు, కార్మికులకు నష్టం కల్గించేలా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధం కావడం దారుణమని విమర్శించారు. దీంతో మద్దతు ధరలు, పంటల కొనుగోలు వ్యవస్థలు, దేశ ఆహార భద్రత చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని ఒకవైపు రైతులు ఉద్యమిస్తుంటే అందుకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందాలకు సిద్ధం కావడం దుర్మార్గమన్నారు. ఆయిల్‌పామ్, కొబ్బరి తదితర పంటల ధరలు పడిపోవడానికి ఈ ఒప్పందాలే కారణమని విమర్శించారు. డబ్ల్యుటిఒ ఒప్పందాల నుండి మోడీ ప్రభుత్వం బయటికి రావాలని, లేనిపక్షంలో ప్రజలు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు నుండి వ్యవసాయాన్ని మినహాయించాలని కోరారు. ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 రోజులకు పెంచి కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆయాసంఘాల నేతలు పుప్పాల కన్నబాబు, బి.జగన్నాధం, సున్నా వెంకట్రావు, జె.గోపి, పోలా వెంకటభాస్కర్, జె.కోటేశ్వరరావు, ఇ.మాధవ, పొటేలు పెంటయ్య, బుగ్గల ప్రభాకర్, రజని, ఆర్.నరసింహారావు పాల్గొన్నారు.

ఏలూరులో ప్రతులు దహనం చేస్తున్న నేతలు

**చింతలపూడి:** డబ్ల్యుటిఒ ఒప్పందాల నుంచి మన ప్రభుత్వం వెనక్కు రావాలని సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌విఎస్.సత్యనారాయణ, సిపిఐ సీనియర్ నాయకులు మామిళపల్లి వసంతరావు, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు పి.సుందర్రావు అన్నారు. అఖిలపక్ష రైతుసంఘాల ఆధ్వర్యాన సిపిఐ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు సోమవారం రైతుసంఘాల ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, కాంగ్రెస్ నాయకులు కృష్ణమూర్తి, ఎఐటియుసి జిల్లా కోకన్వీనర్ తొర్లపాటి బాబు, రైతుసంఘం నేతలు జంగా రామచంద్రరెడ్డి, ఎస్‌కె.ఖాలేషా, ఎస్‌కె.జానీ, తక్కిలపాటి ప్రసాద్, బాణావతి మధు, నల్లి రామచంద్రరావు, మావూరి సత్యనారాయణరెడ్డి, వ్యకాస నేతలు డి.సత్యనారాయణ, వాసు పాల్గొన్నారు.

చింతలపూడిలో మోటారు సైకిల్ ర్యాలీ

**నూజివీడు రూరల్:** నూజివీడు పట్టణంలో చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.నరసింహ, వివిధ సంఘాల నేతలు జి.రాజు, ఎన్ఆర్.హనుమాన్లు, వెంకటేశ్వరరావు, మరియదాసు, రాంబాబు, పుల్లారావు, ఆర్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

నూజివీడులో నిరసన

## నేటి నుంచి టెట్ పరీక్షలు

**ఏర్పాట్లు పూర్తి : డిఇఒ**

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

ఎపి టెట్ పరీక్షలు ఈ నెల 27వ తేదీ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వీటి నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు డిఇఒ అబ్రహం తెలిపారు. మంగళవారం ప్రారంభమయ్యే ఈ పరీక్షలు మార్చి 9వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఏలూరు సమీపంలోని దుగ్గిరాలలోని ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, వట్లూరులోని సిఆర్‌రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ స్కూల్, ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడులోని ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరుగుతాయని, ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి తమ హాల్‌టిక్కెట్, గుర్తింపు ఐడి కార్డుతో పరీక్షా సమయానికి ఒక గంట ముందు చేరుకోవాలని తెలిపారు. పరీక్షా సమయం దాటిన పిదప ఏఒక్క అభ్యర్థినీ పరీక్షకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతినిస్తున్న రైతులు

## ఎత్తిపోతల రైతులకు న్యాయం చేయాలి

**తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా**

**ప్రజాశక్తి - చింతలపూడి**

గ్రీన్ ఫీల్డ్ హైవే, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని, ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కార్యాలయం ముందు రైతులు ధర్నా నిర్వహించారు. భూ నిర్వాసిత రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ కార్యదర్శి చిట్లూరి అంజిబాబు, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలు ఇవ్వడం, చేయడం తప్ప రైతులకు చేసిందేమీ లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2015, 2016లలో చింతలపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణ కోసం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని, కొత్త నోటిఫికేషన్ ఇచ్చి ప్రయివేటు మార్కెట్ విలువ ఆధారంగా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల భూములను రెవెన్యూ రికార్డులలో బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. అనంతరం మండల డిప్యూటీ తహశీల్దార్‌కు రైతులు వినతి అందజేశారు. రైతుల ఆందోళనకు సిఐటియు మండల కార్యదర్శి ఆర్‌విఎస్.నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి డి.సత్యనారాయణ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి శ్రీహరి రెడ్డి, వి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

**ఎంపీ కోటగిరి శ్రీధర్**

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ కొనియాడారు. మండలంలోని తెడ్లం, కేతవరం, బందంచర్ల, టి.నరసాపురం పంచాయతీల్లో నూతనంగా నిర్మించిన సచివాలయం భవనాలను, బందంచర్ల, టి.నరసాపురం పంచాయతీల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలను, గుడ్లపల్లి, తిరుమల దేవిపేట గ్రామాల్లో మల్టీ పర్పస్ సొసైటీ గోడౌన్‌లను, పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, వైసిపి ఏలూరు పార్లమెంటు సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్, పోలవరం నియోజకవర్గం సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మిలతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం కె.జగ్గవరం సొసైటీ మాజీ అధ్యక్షులు వెలిది కృష్ణమూర్తి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి సొసైటీ జెండాను ఎగురవేశారు. జెడ్‌పి హైస్కూల్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవనాల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రజలకు విద్య, వైద్య, రైతుల అవసరాలకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంజిమాల దేవి, జెడ్‌పిటిసి సూరిబాబు, కె.జగ్గవరం సొసైటీ చైర్ పర్సన్, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు, మండల కన్వీనర్ శ్రీను రాజు, ఎంపిపి డి.లక్ష్మి, వెంకటేశ్వరరావు, కేతవరం సర్పంచి తడికలపూడి శివ మాధవి కిషోర్ కుమార్, దేవరపల్లి ముత్తయ్య, కన్నం సర్వేశ్వరరావు, కురసం నిరిక్షనరావు, ఎంపిటిసి బొడ్డపాటి రాంబాబు పాల్గొన్నారు.

కేతవరంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ, ఎంపీ

## అపరిచితుల సందేశాలతో జాగ్రత్త : ఎస్‌పి

**ఏలూరు స్పోర్ట్స్:** ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులు పంపించే మెసేజ్లను, లింకులను ఓపెన్ చేయడం ద్వారా తమ ఖాతాలలో నగదును కోల్పోతున్నారని, అటువంటి మెసేజ్లను, లింకులను ఓపెన్ చేయవద్దని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి సూచించారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈ సోమవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రశాంతి నేరుగా పాల్గొని ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 ఫిర్యాదులు జిల్లా ఎస్‌పి అందజేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఎస్‌పి సామాజిక ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆ ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాలంలో గాని, నేరుగా గాని అపరిచిత వ్యక్తులతో ఎంతో జాగ్రత్త వహించాలని సూచించారు. అంతర్జాలాల్లో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు ఎన్నో అనర్థాలకు దారితీస్తున్నాయని కూడా ఆమె తెలియజేశారు. వారు పంపించే మెసేజ్లను ఓపెన్ చేయడం ద్వారా ఖాతాలలో లక్షలాది రూపాయలను ప్రజలు పోగొట్టుకుంటున్నారని ఆమె అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌లో ఒటిపిలు అడిగినప్పటికీ తెలియజేయరాదని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 28న రాజమండ్రిలో జాబ్‌మేళా

**జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్**

**ప్రజాశక్తి - ఏలూరు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో ఈనెల 28వ తేదీ బుధవారం రాజమహేంద్రవరం, మార్గని ఎస్టేట్‌లో 5 జిల్లాల రీజనల్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలిపారు. ఏలూరు, పశ్చిమ, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ ఐదు జిల్లాలు కలిపి రాజమహేంద్రవరంలో రీజనల్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు అన్నారు. ఈ రీజనల్ జాబ్‌మేళాలో సుమారు 100కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, అలాగే సుమారు 5 వేల మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ రీజనల్ జాబ్ మేళాకు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, పిజి వంటి విద్యార్హతలు ఉండి 18-35 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 9666322032, 9652503799ను (9988853335 - టోల్ ఫ్రీ)ను లేదా https://tinyurl.com/ZONEII-RegionalJobMelaవెబ్‌సైట్‌లో రిజిస్టర్ కావాలని అన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకలీతో హాజరు కావాలని తెలియజేశారు.

# బాలికలు అప్రమత్తంగా ఉండాలి

**పెదపాడు ఎస్ఐ శుభశేఖర్**

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

ప్రస్తుత రోజుల్లో సమాజం పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని పెదపాడు ఎస్ఐ శుభ శేఖర్ చెప్పారు. పెదపాడు మండలం జెడ్‌పి హై స్కూల్‌లో ఉన్న విద్యార్థినులతో దిశ యాప్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వల్ల కలుగు నష్టాలు, తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందితో కలిసి విద్యార్థినులకు అవగాహనా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శుభ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన కాలంలో ప్రతి ఒక్కరూ చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్‌ను కలిగి ఉంటున్నారన్నారు. దాని వల్ల ప్రపంచమే అరచేతిలో ఇమిడిపోయినట్లు, సోషల్ మీడియా ఉద్యమాల ద్వారా ప్రపంచంలో జరిగే వింతలు, విశేషాలను తెలుసుకోవడంలో తప్పు లేదన్నారు. కానీ ఎదుటి వ్యక్తులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించడం తప్పన్నారు. సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా అపరచిత వ్యక్తులతో తగిన జాగ్రత్తలను వహించాలని, సోషల్ మీడియా ద్వారా అపరిచిత వ్యక్తులు పంపే లింకులను గాని సందేశాలను గాని ఓపెన్ చేయరాదని, ఇతర వ్యక్తుల ద్వారా వచ్చే సందేశాలను ఓపెన్ చేసిన యెడల మన యొక్క రహస్యమైన సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు తస్కరిస్తారని విద్యార్థినిలకు అవగాహనను కల్పించారు. ఆపదలో ఉన్న బాధితులు దిశ యాప్‌ను కలిగి ఉంటే పోలీసు వారు మీ వెంట ఉన్నట్లే అనే భరోసా కలుగుతుందన్నారు. ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ 112, డయల్ 100 ఫోన్ చేసిన వెంటనే పోలీసు వారు 10 నిమిషాలలో బాధితుల చెంతకు చేరుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఫోన్‌లో దిశా యాప్ కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శుభశేఖర్

## 'మానవత' ఆధ్వర్యాన పలువురికి సాయం

**భీమడోలు:** స్వచ్ఛంద సంస్థ భీమడోలు మానవత శాఖ తమ సేవలను మరింతగా విస్తృత పరిచేందుకు సహకరించాలని, అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని శాఖ ఛైర్‌పర్సన్ జి.నూకరాజు కోరారు. సోమవారం శాఖ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. దీనిలో భాగంగా సూరప్పగూడెంలో రోడ్డు ప్రమాదం కారణంగా పనిలోకి వెళ్లలేని కార్మికులు ఒకరికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. పొలసానిపల్లిలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు విరిగి, పనిలోకి వెళ్ళలేని స్థితిలో ఉన్న భవన నిర్మాణ కార్మికునికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇదేక్రమంలో ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదానికి గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒక వ్యక్తి కుటుంబానికి నిత్యావసర వస్తువులు బియ్యం, ఇతరాలను అందజేశారు. ఈ కుటుంబాలకు దుస్తులను భీమడోలు సాయిరాం క్లాత్ స్టోర్స్ యాజమాన్యం అందజేసిందని ఛైర్‌పర్సన్ తెలి పారు. మానవత సభ్యులు గంధం వెంకట్రావు పాల్గొన్నారు.

## సకాలంలో 'స్పందన' అర్జీలు పరిష్కరించాలి

**నూజివీడు రూరల్:** నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ వై.భవాని శంకరి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించి, వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి సేంద్రీయ సాగుతో అధిక లాభాలు

**నూజివీడు రూరల్** : కాశ్మీర్, మిస్ ఇండియా, బాలా సుందరి, రెడ్ ఆపిల్, కాశ్మీర్ కూల్ వంటి ఐదు రకాల యాపిల్ బేర్ పండ్లను పండిస్తున్నామని రైతు నాగరాజు తెలిపారు. మండలంలోని బత్తులవారి గూడెం గ్రామానికి చెందిన రైతు నాగరాజు ప్రకృతి వ్యవసాయం ద్వారా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులను పొంది లాభాలను ఆర్జించామన్నారు. అంతర పంటగా కూరగాయలు, మామిడి సాగు చేస్తున్నామని అన్నారు. ఇంత అభివృద్ధిని సాధించినందుకు కృషి చేసిన వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వృద్ధ కళాకారులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలి

**టి.నరసాపురం :** వృద్ధ కళాకారులకు రూ.5 వేలు ప్రభుత్వ పెన్షన్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్ రాజు, సీనియర్ బుర్రకథ కళాకారులు వీరమళ్ళ సత్యనారాయణలు సోమవారం పత్రిక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధ కళాకారులు అనేక పాత్రలతో ప్రేక్షకులను మెప్పించి, ప్రస్తుతం వృద్ధాప్యంలో ఏ పనీ చేయలేక ఆకలి బాధలతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వృద్ధ కళాకారుల ఆర్థిక ఇబ్బందులు తీర్చే విధంగా రూ.5 వేలు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని వారు కోరారు.

## నూతన తహశీల్దార్ కార్యాలయం ప్రారంభం

**జంగారెడ్డిగూడెం టౌన్ :** ఇన్ని రోజులు తహశీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో ఊరికి దూరంగా ఉందని, ఇక్కడ ప్రజలకు అందుబాటులో ఉంటుందని దగ్గర్లో నూతన భవనాన్ని ప్రారంభించినట్లు ఎంఆర్ఒ సెల్వా జోజి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు జంగారెడ్డిగూడెం-ఏలూరు రోడ్డులోని తహశీల్దార్ కార్యాలయం(గత ఆర్‌డిఒ కార్యాలయ భవనం) ప్రారంభోత్సవ కార్యక్రమం ఆర్‌డిఒ కె.అద్దయ్య చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌డిఒ అద్దయ్య, ఎంఆర్ఒ సెల్వా జోజి, ఎంపిడిఒ కె.విజయ ప్రసాద్, జంగారెడ్డిగూడెం మండల రెవెన్యూ సిబ్బంది, ఆ కార్యాలయ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఆసరా నగదు జమ

**ముసునూరు:** వైఎస్ఆర్ ఆసరా నాలుగవ విడత నగదు ప్రతి ఒక్క సంఘ సభ్యురాలు ఖాతాలో జమ కాబడిందని వెలుగు ఎపిఎం కుంటంబాబు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముసునూరు, చిల్లబోయినపల్లి గ్రామాల్లో సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ విడత పేమెంట్ కన్ఫర్మేషన్ సెర్ఫ్ యాప్‌పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అందరూ సిసిలపై లింక్ ద్వారా యాప్ అప్డేట్ చేసుకొని వైఎస్ఆర్ ఆసరా 4వ విడత పేమెంట్ కన్ఫర్మేషన్ సబ్మిట్ చేయాల్సిందిగా ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఆదేశించినట్లు ఆయన తెలియజేశారు.

## ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

**చాట్రాయి:** చాట్రాయిలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ హనుమంతురావు సోమవారం ప్రారంభించారు. రిజర్వ్ బ్యాంక్ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ఫండ్, యూనియన్ బ్యాంకు సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ద్వారా ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను వివిధ మండలాల్లో స్థాపిస్తున్నారు. దానిలో భాగంగా చాట్రాయిలో పోలవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ హనుమంతురావు ప్రారంభించి మాట్లాడుతూ బ్యాంకుల అందించే పొదుపు పథకాలు, రుణ పథకాలు, బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఈ యొక్క ఆర్థిక అక్షర కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. సమాజంలో సైబర్ క్రైమ్స్ ఎక్కువగా జరుగుతున్నాయి కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ ట్రాన్సాక్షన్ ద్వారా లావాదేవీలు చేసుకోవాలని తెలియజేశారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభోత్సవంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కౌన్సిలర్ చందు, కౌన్సిలర్ బొల్లికొండ చెన్నరావు పాల్గొన్నారు.

## శ్రీరాములు ఆశయ సాధనకు కృషి చేయాలి

**ఏలూరు సిటీ:** ఏలూరు నగరంలో సిపిఐ అభివృద్ధికి, చేనేత కార్మిక సంఘం నిర్మాణానికి విశేష కృషి చేసిన సామన శ్రీరాములు ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి పనిచేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పవర్‌పేట సెంటర్ ఏపీ టిడిజన్‌లో సిపిఐ, చేనేత కార్మిక సంఘం నాయకులు సామన శ్రీరాములు సంస్మరణ సభ జరిగింది. సభకు చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడుపు కన్నయ్య అధ్యక్షత వహించారు. సంస్మరణ సభలో పాల్గొన్న సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, శ్రీరాములు అభిమానులు, బంధుమిత్రులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

## నేరాలు – ఘోరాలు

### మహిళ దారుణ హత్య

**పోలవరం:** మండలంలోని కొత్త రామయ్యపేటలో ఆదివారం రాత్రి మహిళ దారుణ హత్యకు గురైంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తరామయ్యపేట పునరావాస కాలనీకి చెందిన మేడూరి దుర్గ (38) వ్యవసాయ పనులకు కూలీలను తీసుకెళ్లే మేస్త్రీగా పని చేస్తుంటారు. ఆదివారం పనులకు వెళ్లొచ్చే యజమాని వద్ద నుంచి రూ.50 వేల సొమ్ము తీసుకొచ్చి దానిలో కొంత ఆదుకుడు కూలీలకు ఇచ్చింది. మిగిలిన సొమ్ము బీరువాలో భద్రపర్చింది. ఈలోపు ఐదుబికెళ్లోస్వాముటంగా ఏడున్నర గంటల ప్రాంతంలో దుర్గ, కుమారుడు సమీపంలో సెంటర్‌కు వెళ్లారు. రాత్రి ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో దుర్గ కుమారుడు ఇంటికి రాగా దుర్గ ఇంటి వాకిలోలో రక్తపు మడుగులో కొన ఊపిరితో ఉంది. వెంటనే ఆమెను కేకలు వేస్తూ తండ్రికి కబురు పంపించి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశాడు. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది. దీనిపై దుర్గ భర్త మేడూరి ముత్యాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని డిఎస్‌పి ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి, సిఐ జి.మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్ పరిశీలించారు. సోమవారం ఉదయం పోలీస్ జాగిలాలు, క్లూస్ టీం, ఫోరెన్సిక్ నిపుణులు రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. పోలీస్ జాగిలం ఇంటి పరిసరాల చుట్టూ తిరిగి సమీపంలోని మామిడితోటలోకి వెళ్లి వెనుదిరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం సిహెచ్‌సికి తరలించారు.

### రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

**జీలుగుమిల్లి:** మండలంలోని రౌతుగూడెం సమీపంలో సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రౌతుగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వైపుకి వెళ్తున్న ద్విచక్ర వాహనం జీలుగుమిల్లి వైపుకి వస్తున్న ద్విచక్ర వాహనాలు రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆ ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇద్దరిలో చిన్న పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

### విద్యుత్ తీగలు చోరీ

**నూజివీడు రూరల్:** మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో రోడ్డుకు ఇరువైపులా ఉండే పొలాల్లో బోర్లు వద్ద విద్యుత్ తీగలను సోమవారం తెల్లవారుజామున దొంగలు దొంగిలించారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై రూరల్ ఎస్ఐ మల్లికార్జున రెడ్డి వెంటనే స్పందించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

**ముసునూరు :** మండలంలో ఎవరైనా అక్రమ మద్యం విక్రయాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని ముసునూరు మండల ఎస్ఐ పి.వాసు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో సారా కాస్తున్న జోగి లక్ష్మణరావు అనే వ్యక్తిని పట్టుకుని, 1800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# తాగునీటి కోసం గ్రామస్తుల విలవిల

## పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి – మండవల్లి

రహదారి విస్తరణ పనులతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్న పనులతో తాగునీటి పైపులు ధ్వంసమై తాగునీరు అందక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు నిర్వహించేలా చేయాల్సిన అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ప్రజల ఇబ్బందులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. దీంతో 7 రోజుల నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో తాగు, వాడుక నీటి కోసం గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న పనులను కాంట్రాక్టర్ మండవల్లిలో ఇస్టానుసారంగా నిర్వహిస్తున్నాడు. దీంతో జాతీయ రహదారిపై ప్రయాణించడానికి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా తాగునీటి పైపులు ధ్వంసం అయిపోయాయి. గ్రామస్తులకు తాగడానికి, వాడుకోవడానికి నీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో గత ఏడు రోజులుగా పిల్లాపాపలతో నీటితో అవసరం ఉన్నా, వివిధ రకాల అవసరాలు తీరక

ధ్వంసమైన పైపులైను

నానా అవస్థలు పడుతున్నామని వారు స్పష్టం చేస్తున్నారు. సర్పంచి, కార్యదర్శికి సమాచారం అందించినప్పటికీ ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు వివరిస్తున్నారు. దీంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక నీటిని కొనుగోలు చేసి అవసరాలను తీర్చుకోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రహదారిపై పనులు నిర్వహిస్తూ పైప్ లైన్లు ధ్వంసం చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్ట్ ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికి వదిలేస్తారా అంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులను నిలుపుదల చేసి, తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. లేకుంటే రోడ్డుపై బైఠాయించి పనులు నిర్వహించకుండా ధర్నా చేస్తామని వారు స్పష్టం చేస్తున్నారు. దీనిపై కార్యదర్శి తోట శ్రీనివాసరావును వివరణ కోరగా జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న పనుల వల్ల పైపులైను ధ్వంసమై తాగునీరు సరఫరా కాని పరిస్థితి నెలకొన్న మాట వాస్తవమే అన్నారు. తాగునీటి అవసరాలకు ఇబ్బంది కలగకుండా పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపామని, పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

### తాగునీటి కోసం అల్లాడుతున్నాం..

పడమటి గణేష్ గ్రామస్తుడు

రోడ్డుపై నిర్వహిస్తున్న పనుల వల్ల పైపులైన్లు ధ్వంసం అయిపోయాయి. సుమారు 7 రోజుల నుంచి నీళ్లు రావడం లేదు. తాగడానికి, వాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పంచాయతీ సర్పంచికి, కార్యదర్శికి సమాచారం అందించాం. రహదారుల అధికారులకు ఫోన్లో సమాచారం అందించాం.. మా ఫోన్ నెంబర్లు ఎవరిచ్చారు అంటూ ప్రశ్నించారే తప్ప సమస్యను పరిష్కరించడానికి రాలేదు. నీటి కోసం అల్లాడుతున్నాం.. వెంటనే స్పందించి తాగునీరు అందించకపోతే రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తాం.

## గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మోటారు బోరు ప్రారంభం

**జంగారెడ్డిగూడెం టౌన్:** జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచి, కీర్తిశేషులు తల్లాడ సత్తిపండు కుమార్తె గీతా నారాయణ గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.2 లక్షలు వెచ్చించి వేసిన మోటారు బోరును సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పలువురు మాట్లాడుతూ గీతా నారాయణ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గీతా నారాయణ మాట్లాడుతూ తన తండ్రి తల్లాడ సత్తిపండు ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ రామన్నదొర, లోవ కుమారి, పోలినాటి బాబ్జి పాల్గొన్నారు.

## జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల హైస్కూల్ ప్లస్‌గా మార్పు

**చాట్రాయి:** మండలంలోని చిన్నంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఇంటర్మీడియట్ కో ఎడ్యుకేషన్ కళాశాలగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మండల విద్యా శాఖాధికారి విఎస్‌వి బ్రహ్మాచారి తెలియజేశారు. 2024-25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్(కో ఎడ్యుకేషన్)లో ఎంపిసి(40 మంది), బైపిసి(40మంది), సిఇసి(40మంది) కోర్సులు మంజూరైయ్యాయన్నారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తామని చాట్రాయి మండల విద్యాశాకాధికారి విఎస్‌వి.బ్రహ్మాచారి తెలియజేశారు.

## పంచాయతీని అభివృద్ధి చేయడమే లక్ష్యం: సర్పంచి

**కొయ్యలగూడెం:** పరింపూడి గ్రామపంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేయడమే ధ్యేయమని సర్పంచి ముప్పిడి విజయ కుమారి అన్నారు. సమైక్య యూత్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో కొన్న ట్రాక్టరును ఆమె ప్రారంభించి మాట్లాడుతూ ఈ మూడు సంవత్సరాల్లో పంచాయతీ నిధులు, ఎంపీ, ఎంఎల్ఎ, జెడ్‌పిటిసి, ఎంపిపి అలాగే జలజీవన్ మిషన్ నిధులు కలిపి సుమారు రూ.4 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు జరిగాయని, కొన్ని జరుగుతున్నాయని తెలిపారు. అభివృద్ధి పనుల వివరాలు పంచాయతీ పాలన మొదలైన ఏప్రిల్ మూడవ తేదీన ప్రజలకు తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడికొండ మురళీకృష్ణ, మట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 'కుక్కునూరులో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలి'

**కుక్కునూరు :** దూరవిద్య విద్యార్థులకు కుక్కునూరులో జిల్లా పరిషత్ హైస్కూల్‌లోనే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్రం సాయికిరణ్ కోరారు. ఆదివారం సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ నుంచి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ గతంలో విలీన మండలాలు అయిన కుక్కునూరు, వేలేరుపాడులో దూర విద్యలో చదువుకోవాలి అంటే 150 కిలోమీటర్లు దూరంలో ఉన్న జంగారెడ్డిగూడెం వెళ్లి విద్యార్థులు అభ్యసించేవారు. అటువంటి తరుణంలో కుక్కునూరుకి సెంటర్ నిర్వహణకు ఆలస్యంగా అనుమతిని ఇచ్చినప్పటికి సుమారుగా 120 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారు. ఈ తరుణంలో పరీక్ష కేంద్రం జంగారెడ్డిగూడెం అందరూ అక్కడికి వచ్చి రాయమనడం బాధాకరం అని అన్నారు. కుక్కునూరు కేంద్రంగానే పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మహిళ గర్భసంచి నుంచి కణితి తొలగింపు

**జంగారెడ్డిగూడెం టౌన్:** మహిళ గర్భసంచిలో ఉన్న కణితిని ఆపరేషన్ చేసి వైద్యులు సోమవారం తొలగించారు. వివరాల్లోకెళితే.. జీడిమల్లి మండలం పాములవారిగూడెంకు చెందిన ఎం.స్వప్న(27) గత కొద్దికాలం క్రితం నుంచి కడుపునొప్పి, పొట్ట పైకి రావడాన్ని గమనించి పట్నంలోని పలు ప్రయివేట్ హాస్పిటల్స్‌కి తిరిగింది. దీంతో భర్త రవీంద్రబాబు సహాయంతో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ అయిన బేబీ కమలని సంప్రదించారు. వారు స్వప్నకు స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించి గర్భసంచిలో కణితి ఉందని గ్రహించారు. సోమవారం ఉదయం ఆపరేషన్ చేసి ఐదు కేజీల బరువు గల కణితిని తొలగించారు.

## దేవపూడిలో సీసీ రోడ్లు ప్రారంభం

**ముదినేపల్లి:** దేవపూడిలో రూ.15 లక్షల గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో మంజూరై నిర్మాణం పూర్తి చేసుకున్న అంతర్గత సీసీ రోడ్లను, అలాగే గ్రామంలో రూ.43.60 లక్షల నిధులతో నిర్మితమైన గ్రామ సచివాలయ, నూతన భవనమును ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

## దోమల మందు పిచికారీ చేయాలి

**జీలుగుమిల్లి:** ఏజెన్సీ గ్రామాల్లో విధిగా దోమల మందు పిచికారీ చేయాలని జిల్లా మలేరియా అధికారి సురేష్ సిబ్బందికి ఆదేశించారు. సోమవారం జీలుగుమిల్లి పిహెచ్‌సిని ఆయన సందర్శించారు. ల్యాబ్‌లో మలేరియాకు సంబంధించిన రికార్డులను, పరీక్షలకు సంబంధించి కిట్లను, స్టాక్‌ను తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో మలేరియా కేసులకు సంబంధించి వివరాలను ల్యాబ్ టెక్నీషియన్ మంగతాయారును అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో, వసతి గృహాల్లో ఎప్పటికప్పుడు దోమల మందును పిచికారీ చేయాలని సూచించారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఆర్‌డిఒకు వినతి

**జంగారెడ్డిగూడెం టౌన్ :** విద్యార్థులకు న్యాయమైన భోజనం అందించి, కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యలయంలో ఏఒకి వినతిని అందించారు. లక్షల రూపాయలు కాంట్రాక్ట్ చేస్తూ విద్యార్థులకు నాసిరకం భోజనం అందిస్తూ వాళ్ల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి ఎం.వెంకట్రాజు అధ్యక్షత వహించగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్స్‌కు, ఏజెన్సీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు కూరగాయలు, గుడ్లు, చికెన్, నాణ్యతలేని సరుకులు అందిస్తున్న జంగారెడ్డిగూడెంకి చెందిన కూరగాయల కాంట్రాక్టర్ పెనుమత్స రాజుపై చర్యలు తీసుకోవాలన్నారు. జీలుగుమిల్లి మండలం ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థులకు రెండు రోజులు నిల్వ ఉంచిన చికెన్‌తో కూర వండి పెట్టిన కారణంగా మరుసటి రోజు ఫుడ్ పాయిజన్ అయ్యి విద్యార్థులకు కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు అవటంతో హాస్పిటల్‌లో వారం రోజులు పాటు వైద్యం చేయించుకుని బయటపడటం జరిగిందన్నారు. దీనికి కారణం హాస్టల్స్‌కు నిత్యం కూరగాయలు, కోడిగుడ్లు, చికెన్, నిత్యావసర సరుకులు అన్ని నాణ్యతలేనివి అందించడం వల్లనే అన్నారు. నాణ్యమైన సరుకులు లేనప్పుడు ప్రశ్నించకుండా కాంట్రాక్టుదారులతో కుమ్మక్కై అలాంటి విషపూరిత ఆహారాలను వండి పెట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయానా డిఎంహెచ్ఒ తనిఖీ చేసి నిల్వ ఉంచిన సరుకులు, కూరగాయలతో వండటంతో ఇలాగే ఫుడ్ పాయిజన్ అవుతున్నాయని తేల్చారు. కనుక ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన సరుకులు అందించని కాంట్రాక్టర్ పెనుమత్స రాజు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని, కాంట్రాక్టును రద్దు చేయాలని అన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

## వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లో సిబ్బంది నిర్లక్ష్యం

**మండవల్లి:** సిబ్బంది నిర్లక్ష్యం వైద్య అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్‌లో వైద్యం అందని ద్రాక్షగా మారింది. క్లీనిక్‌లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీలు రోగులకు దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామస్థాయిలో రోగులకు వైద్యం అందకపోవడంతో పాటు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికి నిదర్శనమే గన్నవరం వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లో సోమవారం సిబ్బంది లేక ఖాళీ కుర్చీలతో వెలవెలబోతున్న వైనం. గ్రామస్తుల కథనం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసి మరింత బలోపేతం చేసింది. రోగికి సకాలంలో వైద్య సేవలు అందించే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పూర్తి సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామస్థాయిలో వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్లను ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. ఇదే క్రమంలో గన్నవరంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ రూ.20.80 లక్షల నిధులతో వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను నిర్మించడం జరిగింది. గ్రామస్థాయిలో వైద్య సేవలందించే విధంగా విలేజ్ క్లినిక్‌లో ఎంఎల్‌హెచ్‌పితో పాటు ఎఎన్ఎం, ఆశ వర్కర్లు, మెయిల్ వర్కర్లను నియమించడంతోపాటు 105 రకాల మందులను కూడా అందుబాటులో ఉంచింది. సిబ్బంది ఉదయం విలేజ్ క్లినిక్‌లో రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించి, మధ్యాహ్న నుంచి గ్రామంలో లేవలేని స్థితిలో మంచం మీద ఉన్న రోగులకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. అయితే సోమవారం గన్నవరం వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లో ఎవ్వరూ లేక వెలవెల బోయింది. సకాలంలో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఎఎన్ఎం పద్మను వివరణ కోరగా ఎంఎల్‌హెచ్‌పి కుమార్తెకు అనారోగ్యం కారణంగా సెలవుపై విజయవాడ వెళ్ళినట్లు తెలిపారు. ఒక మహిళకు ఐరన్ సుక్కు రోజ్ వేయించడం నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వచ్చానని, సాయంత్రం సెక్టర్ మీటింగ్ ఉన్నందున ఇక్కడే ఉన్నానని తెలిపారు. ఎవిడెన్స్ కావాలంటే పిహెచ్‌సికి వచ్చి పరిశీలించుకొమ్మని తెలిపారు.

## ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

**జంగారెడ్డిగూడెం టౌన్:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవటానికి పోలీస్ వారు అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నారని జంగారెడ్డిగూడెం సిఐ రాజేష్, లక్కవరం ఎస్ఐ సుధీర్ తెలిపారు. జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి, జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర ఆదేశాలపై జంగారెడ్డిగూడెం సిఐ రాజేష్, లక్కవరం ఎస్ఐ సుధీర్ సిబ్బందితో కలిసి రానున్నా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామస్తులతో గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభలో జంగారెడ్డిగూడెం సిఐ మాట్లాడుతూ ప్రజలకు భరోసా కల్పించారు. పచ్చని గ్రామాల్లో ఏవిధమైన వైశ్యామ్యాలు లేకుండా మీకు నచ్చినటువంటి రాజకీయ పార్టీలకు ఓటు వేసుకునేలా ప్రతి ఒక్కరూ ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఏవిధమైన సమస్యలను సృష్టించరాదని, రాజకీయ పార్టీలపై ఉన్న అభిమానంతో ఎదుటి పార్టీల వారిని దూషించరాదని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎదుటివారు ఓటును వినియోగించుకునే విషయాలలో ఆటంకాలను సృష్టించరాదని, ఫలానా పార్టీకి ఓటు వేయాలని ప్రలోభాలకు గురి చేయరాదని సూచించారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

## ఆరు వంట సిలిండర్లు సీజ్

**ఏలూరు స్పోర్ట్స్:** వంట సిలీండర్లను అనధికారికంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న నేపథ్యంలో గణేష్ టిఫిన్ సెంటర్‌పై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి ఆరు గృహ అవసర గ్యాస్ సిలీండర్లను సీజ్ చేసిన ఘటన నగరంలో సోమవారం చోటు చేసుకుంది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రంజిత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని ప్రత్యేక ప్రాంతంలో సాయి గణేష్ టిఫిన్ సెంటర్ అనే పేరుతో తమ్మిరెడ్డి వెంకట శివ దుర్గాప్రసాద్ గృహ వినియోగానికి ఉపయోగించే గ్యాస్ సిలీండర్లను వాణిజ్య వినియోగానికి వినియోగిస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రంజిత్ కుమార్ తహశీల్దార్ బి.కన్యాకుమారి సంయుక్తంగా ఆ హోటల్ పై దాడి చేసి గృహ అవసరానికి వినియోగించే ఆరు గ్యాస్ సిలిండర్లను గుర్తించి వాటిని సీజ్ చేశారు. నియజమానిపై కేసు నమోదు చేసి ఆరు సిలీండర్లు సీజ్ చేసినట్లు వారు తెలియజేశారు.

## 'ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

**ఏలూరు టౌన్:** రాష్ట్రంలో ఉన్న వివాహ మధ్యవర్తుల కోసం ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వం నిధులు సమకూర్చాలని ఆంధ్రరాష్ట్ర ఐక్యత వివాహ మధ్యవర్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శోభారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరులోని వైఎంహెచ్ఎలో ఆంధ్రరాష్ట్ర ఐక్యత రాష్ట్ర నూతన కమిటీ మహాజన సమావేశం సంఘం కార్యదర్శి చిత్తుమూరి రత్నరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివాహ మధ్యవర్తులు దేశ, విదేశాల్లో వివాహాలకు మధ్యవర్తులుగా ఉన్నా, వారికి తగిన రక్షణ, ప్రోత్సాహం, ఆర్థిక రక్షణ లేదన్నారు. ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వివాహ మధ్యవర్తుల పారితోషికం చట్ట భద్రత చేయాలన్నారు. పారితోషకం ఎగవేత దారులపై తగు క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి చట్టభద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గంగాధరరావు, సభ్యులు యిర్మీయా, రామరాజు, మహ్మద్ అలీలు పాల్గొన్నారు.

## 29న పాత తాలూకా కేంద్రాల వద్ద ధర్నా

**ఏలూరు అర్బన్:** ఈనెల 27న జరగాల్సిన చలో విజయవాడ కార్యక్రమాన్ని అర్ధాంతరంగా వాయిదా వేయడాన్ని ఎపిటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఉద్యోగ ఉపాధ్యాయుల పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా ఈనెల 29వ తేదీన అన్ని జిల్లాల్లోని పాత తాలూకా కేంద్రాల వద్ద ధర్నా నిర్వహించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో తెలిపారు.

## రోడ్డు అండర్ రైల్వే బ్రిడ్జి ప్రారంభం

**భీమడోలు :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం వర్చువల్ విధానంలో అమృత్ భారత్ స్టేషన్ అభివృద్ధి పథకంలో భాగంగా అంబరుపేట-కురెళ్ళగూడెం గ్రామాలను అనుసంధానం చేస్తూ నిర్మించిన రోడ్ అండర్ బ్రిడ్జి-363 సోమవారం ప్రారంభోత్సవం చేశారు. అంబరుపేట వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి ప్రముఖులు శరణాల మాలతీరాణి, వి.ధర్మారావు, ప్రవీణ్ పటేల్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా అభివృద్ధి క్రమంలో భాగంగా బిజెపి చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన రైల్వే శాఖ ఏలూరు ఎడి జెవిబి చంద్రరావు మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 80 రోడ్ అండర్ బ్రిడ్జిలు, సుమారు 46 అండర్ పాస్‌ల నిర్మాణానికి రూ.1,651 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. దీనిలో భాగంగా అంబరుపేట-కురెళ్ళగూడెం గ్రామాలను అనుసంధానం చేస్తూ రూ.6.91 కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్డు అండర్ బ్రిడ్జికి ప్రధానమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవం చేశారని తెలిపారు. దీని నిర్మాణం వల్ల ఆ ప్రాంతంలో రైల్వే గేటు వల్ల రైళ్ల రాకపోకలకు కలిగే ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచి భాను దీపిక రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ అధికారులు దానయ్య, ప్రసాద్, లోకేష్ పాల్గొన్నారు.

## వైసిపి నూతన కార్యాలయం ప్రారంభం

**కొయ్యలగూడెం:** మండలకేంద్రంలో వైసిపి నూతన కార్యాలయాన్ని కన్నాపురం వెళ్లే రహదారి మార్గంలో పోలవరం నియోజవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయం ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటుందని, రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## చిన్న వెంకన్న హుండీ ఆదాయం రూ.2.39 కోట్లు

**ద్వారకాతిరుమల:** జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలు సోమవారం ఉదయం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడచిన 28 రోజులకు గాను నగదు రూ.2,39,33,108 ఆదాయం వచ్చింది. అలానే భక్తుల కానుకల రూపేణ 424 గ్రాముల బంగారం, 5 కేజీల 674 గ్రాముల వెండి, రూ.500(30 నోట్లు), రూ.1,000(2 నోట్లు), రూ.2,000(13నోట్లు) పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు.

## పార్థసారధికి పలువురి సంఘీభావం

**చాట్రాయి:** ప్రస్తుత పెనమలూరు ఎంఎల్ఎ కె.పార్థసారధి వైసిపిని వీడి టిడిపిలోకి సోమవారం చేరారు. తాడేపల్లిలోని రాష్ట్ర టిడిపి కార్యాలయంలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో చేరడం జరిగింది. ఇప్పటికే పార్థసారధిని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించిన సంగతి విధితమే. పార్థసారధికి సంఘీభావంగా మండలంలోని టిడిపి నాయకులు జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డ, చాట్రాయి మండల టిడిపి అధ్యక్షుడు మరిది వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి కంచర్ల హనుమంతరావు, పుచ్చకాయల నోబుల్ రెడ్డి, చీకటి చెన్నారావు, వెల్ది నాగేశ్వరరావు, బుర్ర నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తాడేపల్లి వెళ్లి సంఘీభావం తెలిపారు.

## పది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి

**ముసునూరు :** ప్రతి ఒక్క 10వ తరగతి విద్యార్థి మంచి మార్కులతో పాస్ అవ్వాలని అసిస్టెంట్ బిసిఎల్ ఫేర్ ఆఫీసర్ రవి ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని ముసునూరు బాలుర వసతి గృహం సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల్లో మంచి నైపుణ్యం కలిగిన ఇంగ్లీషు, హిందీ, లెక్కలు, సైన్సు, సోషల్ సబ్జెక్టుల్లో ఏ విధంగా ఎక్కువ మార్కులు సంపాదించాలో, ఆ మార్కులు ఎలా రాబట్టుకోవాలో అవగాహన కల్పించారు. బిసిఎల్ ఫేర్ హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

**పాస్‌పోర్టు పోయినది**

GUTTULA SRINIVASA RAO అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 16-04-2019న **T0924011** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది. 19-2-2024న పితానివారిపాలెం నుండి పెనుగొండ మెయిన్‌రోడ్డుకు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

**GUTTULA SRINIVASA RAO**
**S/o. Guttula Mohana Rao**
**D.No. 6-173, Peethanivaripalem**
**Penugonda Mandal**
**West Godavari Dist., A.P.,**

**డాక్యుమెంట్స్ పోయినవి**

ద్వారకాతిరుమల మండలం, దొరసానిపాడు గ్రామం, లక్కాబత్తుల మరియమ్మ, నా భర్త లక్కాబత్తుల నతానియేలు (లేటు) యొక్క 47 సెంట్లు భూమి **డాక్యుమెంటు నెం. 2111/2004, Dated: 03-6-2004** ఒరిజినల్ డాక్యుమెంట్స్ ది. 15-02-2024వ తేదీన భీమడోలు నుండి దొరసానిపాడు గ్రామం వస్తుండగా మార్గం మధ్యలో పడిపోవడం జరిగింది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియచేయగలరు.

**లక్కాబత్తుల మరియమ్మ**
దొరసానిపాడు గ్రామం
ద్వారకాతిరుమల మండలం, ఏలూరు జిల్లా
సెల్: 7569369629, 8500965377

**మహారాజశ్రీ ఏలూరు 2వ అదనపు జిల్లా కోర్టులో, ఏలూరు**
ఇ.పి. నెం. 1530/2018 ఇన్
ఎ.ఆర్.సి. నెం. 369/2017

*బిట్వీన్:*
మెస్సర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, ఏలూరు **-డి. హెచ్. ఆర్**
మరియు
జి.వెంకట సత్యన్నారాయణ మరియు యితరులు **-జె. డి. ఆర్**

యిందు పై నెంబరు ఇ.పి. గ్రంథములో ఈ క్రింది షెడ్యూలు జెడిఆర్-2 అయిన జి.కనకదుర్గ శుభవాణి గారికి చెందిన ఆస్తిని పై కోర్టులో వేలం వేయబడును. యీ వేలము నందు యావన్మంది పాటలో పాల్గొనవచ్చును. వేలము ది. **13-03-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట వేలం వేయబడును. పబ్లికేషన్ ద్వారా తెలియపర్చడమైనది.

***Hearing Date: 13-03-2024***

**షెడ్యూలు**

West Godavari District, Chintalapudi Sub-District, Chintalapudi Mandal, Chintalapudi Village accounts area, Ziroyit dry land covered by R.S. No. 1068/2 out of an extent of Ac. 2.46 cents an extent of 400.0.0 sq.yds or 336.0 sq.mtrs is measured and bounded by:
**EAST:** Site of Soundarya Rajan Vijaya Lakshmi - 60ft. **SOUTH:** Site of Devarapali Koteswara Rao - 60ft. **WEST:** Panchayat Road - 60ft. **NORTH:** Site of Soundarya Rajan Vijaya Lakshmi - 60ft.
*(within all easementary rights over the schedule property for ingress and eggress and water let outs etc.)*
***DHR Value: Rs. 35,00,000/-***
***Amin Value: Rs. 40,00,000/-***
(2వ అదనపు జిల్లా కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
**K.V.S.N.R.GOPAL**
Advocate, Eluru